
సాక్షి
ఒడిశా

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,20,783
బంగారం 50 మిల్లీ గ్రాములు
వెండి 14 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



వైభవంగా మల్యావంత్ మహోత్సవాలు

మల్కన్‌గిరిలోని జగన్నాథ మందిరం వద్ద జిల్లా స్థాయి మల్యావంత్ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

- 8లో



హత్యా..ఆత్మహత్యా..!

యువకుడి అనుమానాస్పద మృతి జయపురంలో కలకలం రేపింది.

- 8లో

న్యూస్‌రీల్

నకిలీ పోలీసు అరెస్టు



భగవాన్ నాథ్

జయపురం: నకిలీ పోలీసును జయపురం పోలీసులు అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ జిల్లా సానవార పోలీసు స్టేషన్ పరిధిలోని ఇచ్ఛమనిగుడ గ్రామానికి చెందిన భగవాన్‌నాథ్(41) జయపురం పట్టణంలో కొత్తవీధి, మహంతి వీధి తదితర ప్రాంతాల్లో పోలీసు డ్రెస్సులో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి డబ్బులు అడుగుతుండేవాడు. లాఠీ, పోలీసు డ్రెస్ ఉండటంతో స్థానికులు నకిలీ పోలీసని గుర్తించలేకపోయారు. కొత్తవీధిలో పాత్రికేయుడు లిటు సాహుకు అనుమానం రావడంతో గుర్తింపు కార్డు అడిగారు. ఆ సమయంలో పారిపోతుండగా స్థానికులు పట్టుకొని జయపురం పోలీసులకు అప్పగించారు. వారు తమదైన శైలిలో ప్రశ్నించగా తన వివరాలు వెల్లడించాడు. పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో తెలిపారు.

సికరపాయిలో చోరీ



ఫిర్యాదు చేస్తున్న దంపతులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి ప్రధాన రహదారి కూడలిలో నివసిస్తున్న వాసుదేవరావు అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో వాసుదేవరావు, అతని భార్య నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి వెనుకనున్న తలుపులు విరగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లోని బీరువాలో ఉన్నటువంటి 40 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండితో పాటు రూ.లక్షకు పైగా నగదును దొంగిలించుకు వెళ్లినట్లు బాధితుడు కల్యాణ సింగుపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ సుమంతి మహంతి, ఎస్‌ఐ సంజయ్ ముర్ము, ఏఎస్‌ఐ శివప్రసాద్ సాహులు ఘటన స్థలానికి వెళ్లి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. తాము నిద్రిస్తున్న సమయంలో ఈ దొంగతనం జరిగినట్లు బాధితుడు తెలపారు. తమపై మత్తుకు సంబంధించి స్ప్రే జల్లిఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న సమ్మె



సమ్మెలో పాల్గొన్న గ్రామీణ డాక్ సేవకులు

జయపురం: అఖిల భారత గ్రామీణ డాక్ సేవక సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగుతుంది. కొరాపుట్ జిల్లా గ్రామీణ డాక్ సేవక సంఘం ఆధ్వర్యంలో జయపురం ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దేవరాజ్ దాస్ విలేకరులతో మాట్లాడారు. ఎంతో కాలంగా గ్రామీణ డాక్ సేవకుల డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించటం లేదని ఆరోపించారు. 8 గంటల పనిని నిర్ణయించాలని, తపాలా ఉద్యోగులకు లభిస్తున్న అన్ని సౌకర్యాలు, వేతనాలు కల్పించాలని, కమలేష్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలన్నారు. గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలని, సెలవులు పెంచాలన్నారు. తమ డిమాండ్లు నేరవేరకపోతే ఈ నెల 19వ తేదీ నుంచి డివిజన్ కార్యాలయం ముందు నిరవధిక ధర్నాలు చేపడతామని వెల్లడించారు. తమ డిమాండ్లను నేరవేర్చేంతవరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కార్యాచరణ కమిటీ నేత పి.కె.పండ, కె.రమణ, జగదీష్ పెంటియ, బృందావన ఖాడి, దయాభాన్ నాగ్, పి.ఉష, టి.కామేష్ రావు, ఉపాధ్యక్షుడు సహదేవ్ హరిజన్, కార్యదర్శి రాజేంద్ర సాహు, సుజిత్ ఖొర, అభిమన్యు దేవ్, జయపురం సిటీ కో ఆర్డినేషన్ కమిటీ సాధారణ కార్యదర్శి ప్రమోద్ కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు



వేంకటేశ్వరుని ఆలయం

పర్లాకిమిడి: ధనుర్మాసం సందర్భంగా పర్లాకిమిడి శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 17 నుంచి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు తెలిపారు. గోదా దేవికి నిత్య పూజలు, హారతులు, ప్రవచనాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయని, 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కలుగుతుందని పేర్కొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న మంత్రి సరక



సమావేశంలో పాల్గొన్న రైతులు

రైతులకు అవగాహన కల్పించేందుకే..

ఆధునిక వ్యవసాయ విధానాల వల్ల కలిగే లాభాల గురించి రైతుల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మనోజ్‌కుమార్ ప్రధాన్ అన్నారు. సేంద్రియ వ్యవసాయంతో పాటు ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగంపై మేళాలో అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఆధునిక పద్ధతులతో.. అధిక దిగుబడులు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక
- రాయగడలో వ్యవసాయ మేళా ప్రారంభం



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, అతిథులు

రాయగడ: కాలానుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాష్ట్ర ఆదివాసీ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. రాయగడలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న వ్యవసాయ మేళా, ప్రదర్శన స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ జిల్లాలో అత్యధిక శాతం ఆదివాసీ రైతులే నివాసముంటున్నారని చెప్పారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న వీరంతా పాత పద్ధతులే పాటించడంతో కష్టానికి తగ్గ దిగుబడులు సాధించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారందరికీ వ్యవసాయ మేళా ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ విధానాలు, మెలకువలపై అవగాహన కల్పించడమే మేళా ముఖ్య ఉద్దేశమన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి..

ఈ ప్రాంత రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడటంతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని, ఈ నేపథ్యంలో వాణిజ్య పంటలపైనా రైతులు దృష్టి సారించాలని గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్ మిషన్ పథకం ద్వారా ఎంతో మంది రైతులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఔషధ గుణాల నేపథ్యంలో రాగులకు గిరాకీ పెరగడంతో ఆదివాసీ ప్రాంతాల్లో పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. కందులు, పత్తి పంటల సాగు కూడా పెరిగిందన్నారు.

యువత ఆసక్తి కనబరచాలి..

చదువులు పూర్తి చేసుకున్న ఎంతో మంది నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకునే కన్నా వ్యవసాయంపై దృష్టి సారించాలని మంత్రి సరక హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు. అయితే అవగాహన లోపంతో ఈ ప్రాంత రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలి

జిల్లాలో సాగునీటి వనరులు ఉన్నప్పటికీ అందుకు తగ్గట్టుగా సద్వినియోగమవ్వడం లేదని అమో ఒడిశా నవీన్ ఒడిశా కన్వీనర్ పట్నాన గౌరిశంకర్ అన్నారు. సాగునీటి పథకాలను బాగు చేస్తే పంటలు సశ్యశ్యామలమవుతాయని చెప్పారు. అనంతరం రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి, ఏడీఎం భాస్కర రైతా తదితరులు పాల్గొన్నారు.



యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



ఆధునిక వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను పరిశీలిస్తున్న ఆదివాసీ రైతులు



సబ్సిడీపై అందజేయనున్న ట్రాక్టర్లు


మొసళ్ల లెక్కింపు ప్రారంభం



డ్యామ్‌లో లెక్కింపు చేపడుతున్న అధికారులు



డ్యామ్ ఒడ్డున సంచరిస్తున్న మొసలి



డ్యామ్‌లో సంచరిస్తున్న మొసళ్లు

బరంపురం: గంజాం జిల్లాకే గర్వకారణమైన గోడాహడ్ నది డ్యామ్‌లో ఈ ఏడాది మొసళ్ల సంఖ్య లెక్కింపు ప్రారంభమైంది. గంజాం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో డ్యామ్‌లో 10 బృందాలుగా విడిపోయి అటవీ అధికారులు లెక్కింపు చర్యలు చేపట్టారు. 8 ఏళ్ల క్రితం నగరానికి సమీపంలోని హింజిలికాట్ దగ్గర గోడాహడ్ నది డ్యామ్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొసళ్ల సంతాన అభివృద్ధి చర్యలు చేపట్టింది. అప్పట్లో 5 మొసళ్లతో ప్రారంభమై ప్రతీ ఏడాది సంతాన అభివృద్ధి సంఖ్య పెరుగుతూ 2012 నాటికి వీటి సంఖ్య 46 పెరిగింది. దీంతో ఒక్కసారిగా పర్యాటకుల తాకిడి పెరగడంతో డ్యామ్ ఒక ప్రత్యేక పర్యాటక స్థలంగా నిలిచింది. అయితే 2013 అక్టోబర్‌లో వచ్చిన ఫైలిన్ తుఫాన్, అనంతరం వచ్చిన వరదలు కారణంగా మొసళ్ల సంఖ్య 41కి పడిపోయింది. అనంతం 2017లో వీటి సంఖ్య 55కు చేరగా, 2018లో 45కి తగ్గింది. మళ్లీ 2019లో 55కి పెరిగింది. కాగా ఈ ఏడాది మరలా లెక్కింపు చేపడుతున్నట్లు డీఎఫ్‌వో అముల్యా కుమార్ ప్రధాన్ తెలియజేశారు.

దోపిడీ సొత్తు రికవరీ



బాధితులతో ఎస్పీ సార్వణ్ వివేక్ తదితరులు




మాట్లాడుతూ బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్

బరంపురం: కొద్ది రోజులుగా నగరంలో జరిగిన దోపిడీలకు సంబంధించిన బంగారాన్ని నేరస్తుల నుంచి పోలీసులు రికవరీ చేశారు. ఈ మేరకు బంగారాన్ని 17 మంది బాధితులకు అందజేశారు. బరంపురం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ సార్వణ్ వివేక్ మాట్లాడుతూ.. వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో దోపిడీ ఘటనకు సంబంధించి నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రికవరీ చేసిన బంగారం, నగదు నిజమైన 17 మంది బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లాస్థాయి ఎస్డీపీవోలు, ఐఐసీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్ సంక్రాంతి

- కిక్కిరిసిన ఆలయాలు, శక్తి పీఠాలు



చిన్నకాళికా అమ్మవారు



ప్రత్యేక పూజలు అందుకుంటున్న మా బుడి శాంతమ్మ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బరంపురం: నగరంలోని పలు శక్తి పీఠాలు ధనుర్ సంక్రాంతి పురస్కరించుకుని శనివారం భక్తులతో కిక్కిరిశాయి. దక్షిణ ఒడిశా ఆరాధ్య దైవాలు, గ్రామ దేవతలు చిన్న కాళికా అమ్మవారు, బుడి శాంత అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. దేశ వ్యాప్తంగా గంజాం జిల్లాలో నెయ్యి ఉండలకు (మూవ్వా ఉండలు) ప్రత్యేక గుర్తింపు ఉంది. ధనుర్ సంక్రాంతి గంజాం జిల్లా ప్రజలకు ఒక ప్రత్యేకమైంది కావటంతో కొత్త బియ్యం చెక్కర, నెయ్య, జీడిపప్పు, కొబ్బరి ముక్కలతో తయారైన నెయ్యి ఉండల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. బంధువులకు, స్నేహితులకు నేతి ఉండలతో కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేయటం ఇక్కడ అనవాయితీ. గిరిమార్కెట్, కొమ్మపల్లి, గేట్ బజార్, చిన్న బజార్, పెద్ద బజార్‌లో పూజా సామగ్రీల అమ్మకాలు జోరుగా సాగాయి.



కొమ్మపల్లి జంక్షన్‌లో విక్రయిస్తున్న చెరుకులు, పూజా సామగ్రి



బాపుర్‌లో జీడిపప్పుతో తయారైన మువ్వ ఉండలు కొనుగోలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

కోటేశ్వరుడి హుండీ ఆదాయం రూ.1.53 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని గుడి వీధి ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో హుండీ కానుకల ద్వారా రూ.1,53,318 ఆదాయం వచ్చిందని ఈఓ మునగవల సుకన్య తెలిపారు. శనివారం దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి జి.వి.బి.ఎస్.రవికుమార్, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రధాన అర్చకులు, స్థానిక పెద్దలు, భక్తుల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కించారు. 289 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, ట్రస్టు సభ్యులు పూసర్ల శ్రీదేవి, నల్లపిల్లి యమున, పూసర్ల నగేష్, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, అటెండర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉర్లాంలో గడ్డి వాములు దగ్ధం



కాలిపోతున్న గడ్డికుప్పలు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో ఇద్దరు పాడిరైతులు పోతాబత్తుల ఎర్రన్న, కోల తవుడులకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. శనివారం ఉదయం ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి స్థానికుల సహకారంతో మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. అప్పటికే గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. ఏడాదికి సరిపడా గడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేశామని, రూ. 50 వేల వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



జలుమూరు: మండలంలోని టి.లింగాలపాడుకు చెందిన చల్ల కల్పన(23) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్పన రెండేళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతుండటంతో చికిత్స కూడా ఇప్పిస్తున్నారు. అయినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఇంటికి భారంగా ఉన్నానని భావించి ఆత్మహత్యకు పాల్పడింది. కల్పనకు భర్త భజంగరావు, కుమార్తె జస్మిత, కుమారుడు మోక్షిత్ ఉన్నారు. కల్పన తల్లి చిన్నమ్మడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

శబరి శ్రీక్షేత్ర స్వర్ణోత్సవాలు ప్రారంభం

కొరాపుట్: రెండో పూరీగా కొలిచే కొరాపుట్‌లోని జగన్నాథ శబరి శ్రీ క్షేత్ర స్వర్ణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం పూరీ నుంచి వచ్చిన వేద పండితులు యజ్ఞం నిర్వహణ కోసం ఏర్పాట్లు ప్రారంభించారు. కొరాపుట్ జిల్లా ఎస్పీ అనుభవ్ శుంకర్ ముఖ్య అతిథిగా పాల్గొరు. ఐదు రోజుల పాటు యజ్ఞం జరగనుంది. రాష్ట్ర గవర్నర్ ఈ నెల 21న ముగింపు వేడుకలకు హాజరుకానున్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల్లోని గిరిజనులు, సవర జాతీయులు ఇక్కడి జగన్నాథుడ్ని భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. సవరలు కొలుస్తున్నందున శబరి క్షేత్రంగా పిలుస్తారు. సుమారు 50 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ దేవాలయాన్ని స్థానికులే నిర్మించారు. వారం రోజుల పాటు ఉదయం యజ్ఞాలు, సాయంత్రం ప్రముఖుల వేద ప్రవచనాలు జరుగుతాయి.



అంకురార్పణ చేస్తున్న కొరాపుట్ ఎస్పీ అభినవ్ శంకర్



యజ్ఞ ఏర్పాట్లు చేస్తున్న వేద పండితులు



సేవల్లో మహిళా భక్తులు

హత్యా.. ఆత్మహత్యా..!



పోలీసుస్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న బంధువులు, స్థానికులు

జయపురం: యువకుడి అనుమానాస్పద మృతి జయపురంలో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం జయపురం ఇరిగేషన్ కాలనీలోని శివాలయం ఎదురుగా ఉన్న ఓ ఇంటిలో సత్యవ్రత సామల్(24) అనే యువకుడి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఉరివేసుకున్న స్థితిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువకుడి మరణంపై అనుమానాలున్నాయని స్థానికులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం అదే వీధిలో కొందరితో యువకుడు గొడవ పడ్డాడని.. వారే హత్య చేసి ఇంటిలో ఉరి వేసారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. హత్య, ఆత్మహత్యా అనేది పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత తేలుతుందని పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సత్యవ్రత మల్లిక్ మృతదేహం

సమాజ సేవే రెడ్‌క్రాస్ లక్ష్యం



జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణా శిబిరంలో పాల్గొన్న అతిథులు

జయపురం: సమాజ సేవ, మానవత దృక్పథమే రెడ్‌క్రాస్ ప్రధాన లక్ష్యమని ఒడిశా కేంద్ర విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ నరసింహ చరణ పండా అన్నారు. జయపురం సబ్ డివిజన్‌లోని కొట్‌పాడ్ సమితి కుసుమి గ్రామంలో గంగాధర్ నోడల్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల వేళ సేవలు అందించడంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు ముందంజలో ఉంటారని చెప్పారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించి 43 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా విద్యాధికారి, జూనియర్ రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షురాలు అర్పిత ప్రధాన్, ఉన్నత విద్యా విభాగం ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ త్రినాథ్‌ప్రసాద్ రథ్, బీడీఓ లలిత మండల్, కొట్‌పాడ్ బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి తిలోత్తమ గొకడ, జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి యజ్ఞేశ్వర పండా, జిల్లా సాధన వర్కర్ జ్యోతిరంజన్ నంద, కుసిమి గంగాధర నోడల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కిరణ్ చంద్రమిశ్ర తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి యజ్ఞేశ్వర పండాను సన్మానిస్తున్న దృశ్యం

గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి తోటలను నరికివేస్తున్న సిబ్బంది

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసుస్టేషన్ పరిధి జిగిడిపదర్ అడవుల్లో అక్రమంగా సాగవుతున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి సాగవుతుందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి, గంజాయి మొక్కలను దగ్ధం చేశారు. కొద్ది రోజులుగా జిల్లాలో గంజాయి, నాటుసారాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

35 ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి జి.మఠిగుడ గ్రామ పంచాయితీ తొలదాన, మహులపుట్, కాతపాడ గ్రామాల్లో 35 ఎకరాల్లో సాగుచేస్తున్న గంజాయిని శనివారం ధ్వంసం చేశారు. బొయిపరిగుడ పోలీసులు, అబ్కారీ, డీటీఎఫ్ విభాగాల సిబ్బంది ఆపరేషన్ గ్రీన్‌క్లీన్ అభిజాన్‌లో భాగంగా ఈ దాడులు నిర్వహించారు. దీని విలువ రూ.3 కోట్ల 50 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో బొయిపరిగుడ అబ్కారి అధికారి నీలాంబర మిశ్రా, సబ్‌ఇన్‌స్పెక్టర్ బిష్ణు ప్రసాద్ శబర, ఏఎస్‌ఐ మోతి సింగ్, నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి మొక్కలు తగలబెడుతున్న దృశ్యం

వైభవంగా మల్యావంత్ మహోత్సవాలు

మల్కన్‌గిరిలోని జగన్నాథ మందిరం వద్ద జిల్లాస్థాయి మల్యావంత్ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కలశయాత్రను కలెక్టర్ విశాల్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ అద్భుత ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో క్రీడా, ఐటీ సంస్థల శాఖ మంత్రి తూసర్ కాంత్ బెహరా, నవరంగపూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, ఎస్పీ నితీష్ వాద్వానీ, ఎమ్మెల్యే ఆదిత్యా మాఢీ, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క తదితరులు పాల్గొన్నారు.

– మల్కన్‌గిరి



కలశ యాత్రలో మహిళలు



ఉత్సవాల్లో స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న అధ్యక్షా



రాజస్థాన్ దాండియా నృత్యం



కటక్ కళాకారుల ఒడిశీ నృత్యం



మల్యావంత్ ఉత్సవ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుషార్‌కాంత్ బెహరా



మల్యావంత్ ఉత్సవ వేదికపై అతిథులు



హర్యానా లోక్‌డ్యాన్స్



జిల్లా శాంతాలి నృత్యం



గుజరత్ సిద్దిమాల్ నృత్యం



పశ్చిమబెంగాల్ నుపూర్ నృత్యం



గిరిజన నృత్యం



ఉత్సవ మండపం వద్ద పూజ చేస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్



ఒడిశీ నృత్య ప్రదర్శన

గంజాంలో పర్యటించిన పాండ్యన్



భువనేశ్వర్ నుంచి హెలీకాప్టర్‌లో సరగదా సైన్స్ కళాశాల మైదానానికి చేరుకున్న కార్తికేయ పాండ్యాన్



గంజాం ప్రజలతో ముచ్చటిస్తున్న పాండ్యన్



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కార్తికేయ పాండ్యన్

బరంపురం: ఒడిశా టి-5 ప్రత్యేక బృందం కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ గంజాం జిల్లాలో శనివారం పర్యటించారు. వివిధ సంక్షేమ పథకాలను ప్రారంభించారు. పాండ్యన్ బృందం భువనేశ్వర్ నుంచి హెలికాప్టర్‌లో గంజాం జిల్లా సరగడా సైన్స్ కళాశాల మైదానానికి చేరుకున్నారు. అక్కడ్నుంచి రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ సరేష్ మహాపాత్రోతో కలిసి సరగడా, హింజిలికాట్, కబిసూర్యా నగర్, అస్కా, పులసరా బరంపురంలోని వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం సరగడాలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, ఇతర సంక్షేమ పథకాల అమలును వివరించారు. అనంతరం హెలికాప్టర్‌లో తిరిగి భువనేశ్వర్‌కు పయనమయ్యారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్తికేయ పాండ్యన్, గంజాం జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

క్లుప్తంగా

తాత్కాలికంగా సమ్మె విరమణ



సమ్మెలో బెత్తగుడ సిబ్బంది

పర్లాకిమిడి: గత మూడు రోజులుగా నల్ల బ్యాడ్జీలతో సమ్మె నిర్వహిస్తున్న అగ్నిమాపక దళం ఉద్యోగుల సంఘం సభ్యులు శనివారంతో సమ్మె విరమించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడు రోజుల గడువు కోరడంతో ఉద్యోగులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. తమకు పోలీసు ఉద్యోగుల మాదిరిగా సమాన వేతనం చెల్లించడంతో పాటు పలు డిమాండ్లతో నిరసన తెలుపుతున్నారు.

కొండగుడ్డి సమీపంలో దారుణ హత్య



సంఘటన స్థలంలోని రాజమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు, సీఐ వెంకటేశ్వరరావు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొండగుడ్డి సమీపంలోని మామిడితోటలో వృద్ధురాలు మహంతి రాజమ్మ(64) దారుణ హత్యకు గురైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. కొండగుడ్డి ప్రాంతానికి చెందిన రాజమ్మ శుక్రవారం మధ్యాహ్న సమయంలో కుమిలి నుంచి సీహెచ్ అగ్రహారం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి సమీపంలో ఉన్న మామిడితోటలోకి ఆవులను మేతకు తీసుకు వెళ్లింది. సాయంత్రం 6 గంటల వరకు రాజమ్మ ఆవులను తీసుకుని, ఇంటికి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం ఆమె కొడుకులు సమీప ప్రాంతాల్లో వెతికారు. మామిడితోటలో కత్తిపోట్లతో రక్తపుమడుగులో విగతజీవిగా పడిఉన్న రాజమ్మను చూసి, ఆమె కొడుకులు బోరున విలపించారు. మృతురాలు రాజమ్మకు నలుగురు కొడుకులు రాము, అప్పలనాయుడు, రాజినాయుడు, లక్ష్మనాయుడు ఉన్నారు. రాజమ్మది ముమ్మాటికే హత్యేనని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఆమెపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, పరారయ్యారని పేర్కొన్నారు. రాజమ్మ హత్య విషయం తెలుసుకున్న విజయగనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ బాలకృష్ణ శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని, పరిశీలించారు. హత్య ఘటనపై ఆరాతీశారు. క్లూస్ టీమ్‌తో పలు ఆధారాలు సేకరించారు. బయట వ్యక్తులు హత్య చేశారా లేకపోతే స్థానికంగా ఉన్న వ్యక్తులే ఈ హత్యకు పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి మృతదేహం తరలించారు.


సారా తయారీపై ఎస్ఈబీ ఉక్కుపాదం



సారా టబ్బులను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: సారా నిర్మూలనే ధ్యేయంగా సారా తయారీపై ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది ఉక్కుపాదం మోపారు. కొమరాడ మండలంలోని లంజి గ్రామ సమీపంలోని సారా తయారీ స్థావరాలపై ఎస్ఈబీ సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించి, 2,800 బెల్లంఊట, 20 లీటర్ల సారా, వంటసామగ్రి పట్టుకుని, ధ్వంసం చేశారు. ఇదే విషయమై శనివారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర మాట్లాడుతూ ఎక్కడా సారా తయారీ అనేదే లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఆకస్మిక దాడులు ముమ్మరం చేసి, ప్రతీ బోటును పరిశీలిస్తున్నామన్నారు. సారా తయారీదారులు, విక్రేతలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇదిలా ఉండగా, అగ్రహారం రైల్వే బ్రిడ్జి సమీపంలో పోలీస్ సిబ్బంది మాటువేసి, 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో వరలక్ష్మి ప్రతిభ



వరలక్ష్మిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

విజయనగరం: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం మహారాజా అటానమస్ కళాశాలకు చెందిన విద్యార్థి పి.వరలక్ష్మి ప్రతిభ కనబరిచింది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో విజయనగరం నుంచి పాల్గొన్న పి.వరలక్ష్మి డిస్క్ త్రోలో మొదటి స్థానం చేజిక్కించుకోగా... షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. అంతర్ కళాశాలల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారిణిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, కన్వీనర్‌లు, పీడీలు, అధ్యాపక సిబ్బంది శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

అగ్నిప్రమాదంలో.. వృద్ధుడు సజీవదహనం

- వేపాడ మండలం బొద్దాంలో ఘటన
- కళ్లముందే జరిగిన ప్రమాదం
- విలపిస్తున్న కుటుంబ సభ్యులు



సిమ్మ నాగమయ్య (ఫైల్)



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పూరిపాక, మంచంపైనే సజీవదహనమైన వృద్ధుడు నాగమయ్య

వేపాడ: విజయనగరం జిల్లా వేపాడ మండలం బొద్దాంలో శనివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ వృద్ధుడు కళ్లముందే సజీవ దహనమయ్యాడు. మంటలు అదుపుచేసేలోగా నష్టం జరిగిపోయింది. కళ్లముందే వృద్ధుడు కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానికులు, వేపాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్.కోట మండలం చందులూరు గ్రామానికి చెందిన సిమ్మ నాగమయ్య(72) వృద్ధాప్యం కారణంగా బొద్దాంలో నివసిస్తున్న చిన్నకుమార్తె సూరమ్మ ఇంటి వద్ద ఆశ్రయం పొందుతున్నాడు. చలిగా ఉందని తండ్రి చెప్పడంతో నిప్పుల కుంపటిని మంచం వద్ద పెట్టింది. అందులోకి దుప్పటి జారి పడడంతో మంటలు రాజుకుని పూరిపాకను అంటుకున్నాయి. కుమార్తెతో పాటు స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నాగమయ్య మంచంపైనుంచి లేవలేక పడుకున్నట్టుగానే సజీవదహనమయ్యాడు. మృతునికి ముగ్గురు ఆడపిల్లలతో పాటు భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ పోటీలకు రామభద్రపురం విద్యార్థులు



వజ్రపు పవన్‌కుమార్



గుర్ల: విద్యార్థి మురళిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్



రామభద్రపురం: జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్‌లో భాగంగా నరసారావుపేటలో ఇటీవల చేపట్టిన అథ్లెటిక్స్ పోటీల్లో రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డి.శ్రీదేవి, బి.వెంకటరావు శనివారం తెలిపారు. అండర్–17 విభాగంలో పొట్టంగి పవన్‌కల్యాణ్ ట్రిపుల్ జంప్ పోటీలో, అండర్–19 విభాగంలో బొర్రా పార్థు పోల్ వాల్టుల్ క్రీడాపోటీలో ద్వితీయ స్థానాల్లో నిలిచి, ప్రతిభ కనబరచడంతో వారు జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. సదరు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.నాగభూషణరావు, ఎం.మురళీధర్, కె.దాలినాయుడు అభినందించారు.

త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థి..

గుర్ల: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కరిమజ్జి మురళి ఎంపికైనట్లు పీఈటీ కె.లక్ష్మణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో నంద్యాలలో జరిగిన అండర్–17 రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సదరు విద్యార్థి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.



శృంగవరపుకోట: విద్యార్థి సత్యనారాయణతో ఉపాధ్యాయులు

సౌత్‌జోన్ పోటీలకు పవన్‌కుమార్..

విజయనగరం: ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన విజయనగరం క్రీడాకారుడు వజ్రపు పవన్‌కుమార్ త్వరలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఇటీవల రాజాంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న పవన్‌కుమార్ ఉత్కృత్తమ ఆటతీరుతో విజేతగా నిలిచి, సౌత్‌జోన్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 19వ తేదీ నుంచి చెన్నైలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ తరఫున పవన్ ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఈ మేరకు అతడిని విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, కార్యదర్శి ఎన్.సురేష్, వై.కుమార్ అభినందించారు. సౌత్‌జోన్ పోటీల్లో మెరుగైన ఆటతీరుతో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

ధర్మవరం నుంచి సత్యనారాయణ..

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి పట్నాన సత్యనారాయణ జాతీయ స్థాయి పరుగుల పోటీకి ఎంపికైనట్లు పాఠశాల పీడీ పి.శ్రీరాములు శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇటీవల నిర్వహించిన అండర్–19 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 4x100 పరుగు పందెంలో అతడు విశేష ప్రతిభ కనబరిచి, బంగారు పతకం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రంలోని నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మన రాష్ట్రం తరఫున సత్యనారాయణ ప్రాతినిథ్యం వహిస్తారు.

అథ్లెటిక్స్‌లో సత్తా..

సాలూరు: విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీలో గత రెండు రోజుల పాటు జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. ఎం.హరీష్ 5, 10 కిలోమీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించగా, ఏకాంబరం 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో బ్రాంజ్ మెడల్, వేలంగిణి షార్ట్‌పుట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు.

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

- కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సోమవారం నుంచి యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఇదే విషయమై ఐసీడీఎస్ పీవోలు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులతో శనివారం వెబినార్ ద్వారా సమావేశమైన ఆమె పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్న కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు అందజేసే సేవల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా కేంద్రాలు తెరిచి, వాటిని నిర్వహించాలని తెలిపారు. క్రమం తప్పకుండా పక్కాగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందివ్వాల్సిన పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఇప్పటికే కేంద్రాల నిర్వహణను సచివాలయ సిబ్బందికి అప్పగించడం జరిగిందని, 80 శాతం వరకు కేంద్రాలను సచివాలయ సిబ్బంది తీసుకున్నారని, మిగిలినవి కూడా తీసుకుని సోమవారం నుంచి పూర్తిస్థాయిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీలతో మంత్రుల బృందం చేసిన చర్చలు విఫలమయ్యాయని, ప్రభుత్వం మరికొంత సమయం కోరిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా అర్హులకు మేలు జరిగేలా అంగన్‌వాడీ కేంద్రాలను నడపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు, పిల్లల తల్లుల సహకారం తీసుకుని, సమీప పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి, అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి, లబ్ధిదారులకు వడ్డించాలన్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని, అయితే అంగన్‌వాడీ కేంద్రాలు అనేవి ప్రభుత్వ కార్యాలయాలని, వాటిని నిర్వహించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. ఈ విషయమై ఎస్పీతో మాట్లాడానన్నారు. ఇప్పటికే 98 శాతం టీహెచ్‌ఆర్ పంపిణీ జరిగిందని మిగిలినది సోమవారం జరగాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను వేరేగా నిర్వహించాలని, తిరిగి అప్పజెప్పేటప్పుడు స్టాక్‌ను సక్రమంగా అప్పగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టాక్స్‌ను వీడియో చేసి, ఉంచాలని, ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కేంద్రాలను తెరిచి ఉంచాలన్నారు. ఎంపీడీవోలు, ఐసీడీఎస్ పీవోలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. కేంద్రాలవారీగా మ్యాపింగ్ జరగాలని, ప్రతిరోజూ స్టాక్‌పై సాయంత్రం నివేదిక అందించాలన్నారు. ప్రతిరోజూ కేంద్రాలను సందర్శించి, కార్యకలాపాలను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో రాజ్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూ జిల్లా కో–ఆర్డినేటర్ నిర్మలాదేవి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, డీఈవో బి.లింగేశ్వరరెడ్డి, మెప్మా పీడీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

25 వేల మందికి ఆరోగ్య తనిఖీలు

- డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు



వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌వో జగన్నాథరావు

కొమరాడ: మండలంలోని సివిని గ్రామంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేయడం జరుగుతోందన్నారు. నవంబరు 15వ తేదీ నుంచి ఆరంభమైన ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 180 వైద్య శిబిరాలు చేపట్టి, 25,471 మందికి ఆరోగ్య తనిఖీలు చేయడం జరిగిందన్నారు. వీరిలో 2,483 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయగా 451 మందిని రిఫర్ చేయడం జరిగిందని, 719 మందికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేయగా, ఐదుగురిని రిఫర్ చేయడం జరిగిందన్నారు. 7,025 మందికి పీఎం జనారోగ్య యోజన కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రోజుకు 8 వైద్య శిబిరాలు చొప్పున నాలుగు మండలాల్లో నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరంలో ఎంతమందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు.. ఎవరైనా క్షయ, సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న వారు ఉన్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.శిరీష, సర్పంచ్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి విజయ కో-ఆపరేటివ్ సొసైటీ చెల్లింపులు

విజయనగరం అర్బన్: నగరంలోని ది విజయ కో–ఆపరేటివ్ సొసైటీలో డిపాజిట్లు చేసిన వారికి డిపాజిట్ల చెల్లింపులు చేయడం జరుగుతుందని సొసైటీ లిక్విడేటర్ బి.మురళీధరరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ సహకార అధికారి(పూల్‌బాగ్ కాలనీ గేట్) కార్యాలయంలో చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ చెల్లింపులు చేయడం జరుగుతుందన్నారు.

సెంట్రింగ్ పనులకు వచ్చి, మృత్యువాత



మృతి చెందిన గోవర్ధన్ బౌరి

సాలూరు: మండలంలోని కుడుమూరు జంక్షన్‌లో గ్రీన్‌ఫీల్డ్ హైవే సెంట్రింగ్ పనులకు వచ్చిన జార్ఖండ్ వాసి గోవర్ధన్ బౌరి(53) పాముకాటుకు గురై, మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాచిపెంట ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జార్ఖండ్ రాష్ట్రంలోని దన్బాద్ జిల్లా, బ్రహ్మందిహ గ్రామానికి చెందిన గోవర్ధన్ బౌరి సెంట్రింగ్ పనుల అనంతరం శుక్రవారం రాత్రి బహిర్భూమి కోసమని ఆరుబయటకు వెళ్లాడు. అక్కడ అతడిని పాము కాటు వేయగా, వైద్యసేవల నిమిత్తం పాచిపెంట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

19న వాహనాల వేలం

సాలూరు: స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 19వ తేదీన వేలం వేయనున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సారా, గంజాయి తరలింపు కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, ఓ వ్యాన్‌ను వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని, వాహనాలు సొంతం చేసుకోవాలన్నారు.

హత్య కేసులో మరో నిందితుడు అరెస్టు



మాట్లాడుతున్న ఎస్డీపీవో సేనాపతి తదితరులు

రాయగడ: స్థానిక గౌతంనగర్‌లో శుక్రవారం జరిగిన హత్య కేసుకు సంబంధించి మరో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి ఖలిమిసిగుడ గ్రామానికి చెందిన హేమంత్ జిలకర ఓరఫ్ రాజు (24)గా గుర్తించారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురు అరెస్టయ్యారు. దీనికి సంబంధించి ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కమలాకాంత్ కుహరోలు శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

ఇదీ విషయం

ఖలిమిసిగుడ గ్రామానికి చెందిన మిన్నారావు హిమిరిక అనే వ్యక్తి కూతురును అదే గ్రామానికి చెందిన ప్రదీప్ కౌలక ప్రేమించాడు. స్థానిక అటానమస్ కళాశాలలో ప్లస్‌త్రీ ఆర్ట్స్ చదువుతున్న ప్రమోద్, మహిళ కళాశాలలో చదువుతున్న మిన్నారావు కూతురు ప్రేమ వ్యవహారం తెలుసుకున్న మిన్నారావు కుమారుడు దీపన్ పలుమార్లు ప్రమోద్‌ను హెచ్చరించాడు. అయితే హెచ్చరికలు ప్రమోద్‌ను పట్టించుకోలేదు. దీంతో అతనిని హతమార్చేందుకు వ్యూహం పన్నాడు. అందుకు ఖలిమిసిగుడ గ్రామంలోని మురళి కొండగిరి, హేమంత్ జిలకరల సాయం తీసుకుని ఒక పథకం ప్రకారం హత్య చేశాడు. హత్యకు వినియోగించిన కత్తి, స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పూర్తిస్థాయిలో విచారించనున్నట్లు వెల్లడించారు.

మాట నిలబెట్టుకున్నారు..

- వంశధార నిర్వాసితులకు పరిహారం చెల్లింపు
- ముఖ్యమంత్రి తీరుపై ప్రశంసలు



భామిని: వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వెంటనే స్పందించడం.. వారి ఖాతాలకు లక్షలాది రూపాయలు పరిహారం జమచేయించడంతో నిర్వాసితులు సంతోషపడుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పాలకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అంటూ కొనియాడుతున్నారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు గత ప్రభుత్వం నామమాత్రపు పరిహారం చెల్లించిందని ప్రజాసంకల్పయాత్రగా వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక రైతులు వివరించారు. తమ గోడు వినిపించారు. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే ఎకరానికి రూ.లక్ష చొప్పున అదనంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు చెల్లింపులు పూర్తిచేశారు. అయితే... సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు ఈ పరిహారం అందలేదు. పలాసలో కిడ్నీ రీసెర్చ్‌సెంటర్ ప్రారంభానికి వచ్చిన సమయంలో పలువురు రైతులు ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందిస్తూ పరిష్కారం చెల్లింపునకు ఆదేశించారు. దీంతో భామిని మండలంలోని కాట్రగడ–బి, నేరడి–బి, బిల్లుమడ, నులకజోడు, సింగిడి, భామిని, లివిరి, దిమ్మిడిజోల, బాలేరు గ్రామాలకు చెందిన రైతుల ఖాతాల్లోకి లక్షలాది రూపాయలు జమయ్యాయి. కాట్రగడ–బి గ్రామంలోని 8 మంది రైతుల ఖాతాలకు ఏకంగా 22 లక్షలు జమకావడంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

పరిహారం అందింది



వంశధార ప్రాజెక్టులో భూములు కోల్పోయి నామమాత్రపు పరిహారం చెల్లించి గత ప్రభుత్వం చేయి దులుపుకుంది. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఎకరానికి అదనంగా రూ.లక్ష చొప్పున అదనపు పరిహారం ఇచ్చి ఆదుకున్నారు. నేరుగా బ్యాంకు ఖాతాలోకి చేరాయి. రైతు కష్టాలు తెలిసిన జగనన్న మేలును మరువలేము.

– పాండవ గౌడో, నిర్వాశిత రైతు, కాట్రగడ–బి, భామిని మండలం

ఆదుకున్నారు



వంశధార నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున అదనపు పరిహారం అందజేసి ఆదుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పడని మరోసారి రుజువు చేశారు. సమస్య విన్న వెంటనే సాంకేతిక కారణాలతో నిలిచిన అదనపు పరిహారాలను చెల్లించి ఆదుకున్నారు.

– తోట లాల్, నిర్వాసిత రైతు, కాట్రగడ–బి, భామిని మండలం

పశువుల సంచారానికి చెక్



పశువుల కొట్టాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

- రూ.5 లక్షలతో కొత్తపేట ప్రాంతంలో పశువుల కొట్టాం ఏర్పాటు
- విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో విచ్చలవిడి పశువుల సంచారానికి చెక్ పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శనివారం శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా 14వ డివిజన్ కొత్తపేటలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న పశువుల కొట్టాంనకు.. 20వ డివిజన్ కొత్తగ్రహారం ప్రాంతంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువల నిర్మాణ పనులను శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సలహాలు, సూచనలతో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండడంతో తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పశువుల కొట్టాం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారులపై పశువులు సంచరిస్తే వాటిని కొట్టాంకు తరలిస్తామని చెప్పారు. అదేవిధంగా రహదారులు, కాలువలు ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగ్రహారం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్ మాట్లాడుతూ, నగర ప్రజలు తెలియజేసిన సమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించి మరింత మెరుగైన పాలనకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ప్రారంభం



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లిమర్ల: ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలు నెల్లిమర్లలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కార్మిక సంఘాల కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కార్మిక సంఘాల కార్యాలయం ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ, అటు దేశంలో ఇటు రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వాలు నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. ఒక పక్క నిరంకుశ విద్యావిధానాలతో విద్యార్థులను చదువుకు దూరం చేస్తూనే.. మరోపక్క చదువు చెప్పే ఉపాధ్యాయులు పట్ల కూడా ప్రభుత్వాలు కర్కశంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ పావని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి.రామ్మోహనరావు, జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.